# తాజా పూలదండ

-బి.వి.దుర్గాప్రసాదరావు

చాలా ఏళ్ల తరువాత కనబడ్డాడు శంకరం. ముందుగా తనే నమస్కరిస్తూ నన్ను పలకరించాడు. నేను ఆనందాశ్చర్యాల్లో పడ్డాను.

నాకు ఇద్దరు ఆడపిల్లలు - శాంతి, కిరణ్మయి.

శాంతి భర్త శంకరం. సీమంతం చేసి తొలుత కాన్పుకై శాంతిని ఇంటికి తీసుకు వచ్చాం. బిడ్డ రెప్ప తెరవకముందే శాంతి కన్ను మూసింది కరెంటు షాకుకు గురైె.



శంకరం మాకు భరోసాగా నిలబడి కిరణ్మయి పెళ్ళి సంబంధం కుదిర్చాడు.

తనకు మానుండి ముట్టిన కట్నకానుకలన్నింటినీ తిరిగి ఇచ్చేసాడు.తర్వాత శంకరం మిలట్రీ జాబ్ అని ఊరు విడిచి వెళ్ళిపోయాడు తన తల్లి దండ్రులతో. తర్వాత అతని నుండి ఏ సమాచారం మాకు లేదు!

కాకతాళీయంగా, ఇదిగో...ఈరోజున తిరిగి ఎదురయ్యాడు ఈ దారిన వస్తూ.

"అత్తయ్య, కిరణ్మయి ఎలా ఉన్నారండీ?" అడిగాడు శంకరం.

నేను తేరుకుంటూ "ఆఁ! కిరణ్మయి వాళ్లు విజయవాడలో ఉంటున్నారు. దానికి ఇద్దరు పిల్లలు" అని చెప్పాను.

"అవునా? ఇంతకీ మీరు ఈ ఊర్లో ఉన్నారేమిటి?" అడిగాడు శంకరం.

నేను జవాబు చెప్పడానికి సిగ్గుపడ్డాను.

"ఏదైనా పనిమీద వచ్చారా?" అడిగాడు శంకరం.

"ఊఁ..అబ్బే. కాదు. ఓల్డేజ్ హోంలో ఉంటున్నాం నేను నా భార్య!" అన్నాడు.

"అదేమిటి? పల్లెలో మీకు ఇల్లు, కొద్దిపాటి భూమి ఉండేవిగా!" అన్నాడు శంకరం.

"కిరణ్మయి వాళ్లు విజయవాడలో ఇల్లుకట్టుకున్నారు. అది సగంలో ఆగిపోతే పల్లెలోని ఆ ఇంటిని, భూమిని గొడవ చేసి మాచే అమ్మించారు. ఇక్కడ ఈ హోంలో మమ్మల్ని చేర్పించి చేతులు దులుపుకున్నారు" చెప్పాను.

శంకరం నొచ్చుకున్నాడు. నాతో హోంలోకి వచ్చాడు. నన్నూ నా భార్యని ఇకపై తన ఇంటిలో, తమతో ఉండమని బలవంతం చేసి మమ్మల్ని బయలుదేరించాడు అక్కడినుండి.

దారిలో చెప్పాడు కోరి ఉద్యోగ విరమణ చేసి తను ఈ ఊరు ఈ మధ్యనే వచ్చేసినట్టు...ఇక్కడే ఒక కాన్వెంట్ పెట్టబోతున్నట్టు.

"బాబూ! నువ్వు పెళ్లి చేసుకున్నావా?" అని అడిగింది నా భార్య శంకరంని.

అతను చిన్నగా నవ్వేడు "చేసుకున్నాను" అని చెప్పాడు.

"మీకు...మేము...ఇబ్బంది కదా!" అన్నాను.

"కాదండీ!" అన్నాడు శంకరం.

నేను నా భార్య మొహాలు చూసుకున్నాం.

మా సామాన్లతో మమ్మల్ని ఇంట్లోకి తీసుకు వెళ్ళాడు శంకరం. అతని తల్లిదండ్రులు నన్నూ, నా భార్యను పలకరించారు ఆత్మీయంగా.

"వీళ్లు ఇకపై మనతోనే వుంటారు. నువ్వేమంటావు? వీళ్లు ఇక్కడ ఉండడానికి మొహమాటం పడుతున్నారు. అంత్యఘటన కంటే ఆదిలో తేల్చుకోవడమే మేలుకదా! చెప్పు, నా భార్యగా నువ్వు ఏం చెబుతావు?" అన్నాడు శంకరం అటు వైపు ప్రత్యేకించి చూస్తూ.

నేను అటునుండి చూపు మార్చుకొని శంకరం వైపు తిరిగాను.

"మేరు పర్వతం లాంటి నీ ఔన్నత్యం గురించి మాట్లాడడానికి నాకు మాటలు రావడంలేదు" అన్నాడాయన కన్నీళ్లతో శంకరాన్ని కౌగలించుకుంటూ. తిరిగి అటు చూశాను- నా తడి చూపులకు 'తాజా పూలదండ' వెనుకన, ఫోటోలో ఉన్న మా కూతురు....శాంతి నిండైన నవ్వుతో కనిపించింది.

★